
# అదృష్టం జారిపోదు

మానస



"తవఁకి తెలీదేటుందమ్మగోరూ ?"

అస్పటాల్లో సేర్సుకోనాకి పెద్ద డాట్రు బాబూ, మందులివ్వనాకి సిన్న డాట్రూ, మడిసి లానే ఉండి సూణ్ణాకి ఓర్డు బోయిలూ, వఁతులోరీగా ఎవుడికందిందాడు ముందే గుంజేసుకోగా, మా వరసొచ్చి మావుఁ నాలుగురాళ్లు కళ్లసూడ్డవంటే... మడిసి సచ్చిపోయినప్పుడే తల్లీ ! నానడిగిందే ఎక్కువ కాదు;నలుగురంఓటాలేసుకోవాల'' వినయంగా చేతులు కట్టుకుని చెబుతున్నాడు శవాలు మోసే తోటీ శారదతో.

"సరేలే. కానీండి!" నిర్లిప్తంగా అంది శారద.

నలుఁగురు తోటీలూ సాయంపట్టి శ్రీనివాస్ భౌతికకాయాన్ని హాస్పిటలు గేటు దగ్గరికి చేర్చారు. ఆమె పర్సులో మిగిలిన రెండు పదులూ తీసి వాళ్లకిచ్చింది.

వాళ్లు వెళ్లిపోయారు.

*　　*　　*

"... ధరలన్నీ మా సెడ్డ పిరవైఁపోనాయి తల్లీ !

మేళాంతో ఎదురు కర్రల పాలకాడి మీన మడుసులు మోసుకెల్లాలంటే... రెండొంద లౌద్ది !

సిన్నకారు మీన తోలుకెల్లి అగ్గెట్టేయా లంటె నూటయాభయవుద్ది !

అయన్నీ ఎందుకు ? సొల్పంలో నాగేయ మంటారా, మా సొర్గోహనం, అదే తల్లీ, మా తోపుడుబండీ మీన నాగేత్తాం. వంద రూపాయలు సార్జీలవుతాయి.

ఎలగెల్లినా, మళ్లీ కాటికాడ ఖర్చులు వీయే! సెప్పండమ్మా తొరగా! మా కేరే బేరాలుండాయి !"

కారాకిళ్లీ నవుల్తా ఏవేవో చెప్పుకు పోతున్నాడా వ్యక్తి. దేనికీ పెదవి విప్పని శారద సూటిగా వాడి కళ్లలోకి చూసింది. వాటిలో జాలి అన్నది ఎక్కడా లేదు. బీడీ కాల్చుకుంటూ అతి సునాయాసంగా చెబుతున్నాడు. ఆమె కళ్లలో ఏంగ్రహించాడో మళ్లీ అన్నాడు.

"సెప్పాల్సింది నా ధరమం గాబట్టి సెప్పాను. ఈ బత్తు పద్దతులియ్యేనమ్మా! సూసాత్తుంటే ఈ ఊరు వాగా నేదు. ఒక మాటినుకోండమ్మగోరూ: తవఁరీ పీనుగ నేసుకుని మీ వూరెళ్దారనుకుంటే మాత్తరం అవనా సార్జీలు ...? ఇంతకి డబలింగూ, డబలింగుకి డబలింగూ అయిపోతాయి కదమ్మా!

అంతుకే తవఁకన్నీ బోధ సేశాను.

అయితే, మరికోమాట కూడా నేక పోలేదు తల్లీ !

మడిసి దక్కనేదుగా అని మునిసిపాలిటోళ్లకి పీనుగ నొగ్గేసి కూడా ఎల్లిపోతూంటా రమ్మా కొంతమంది ధరమ పెబువులు. సీ...సీ! సొప్పొద్దూ...; అలగ మునిసిపాలిటోళ్ల కొగ్గేసిన పీనుగ పాట్లు కుక్కలు కూడా పడవు తల్లీ! సందేళ దాకా సూసి, ఏ నారీలోనో ఈడ్సుకెల్లి,యాడో పెంటల్లో కప్పెట్టేత్తారు.

మరికోమాట ...

ఈళ్లే ఎదవలనుకుంటే...ఈళ్ల జేజెమ్మ ల్లాంటి అలగా జాతోళ్లు కూడా కాసుక్కూసుంటారు మాయమ్మా! దహనం సేసేత్తామని, పాత్తిక్కీ పరక్కీ బేరవాఁడ కుని, పీనుగ నెత్తుకుపోయి, ముష్టి ల్లి (క్కమ్మేత్తారు ఆ నా కొడుకులు చెంటరు చెంటర్నో 'దిక్కునేనోడు బాబూ! అనాధోడు బాబూ ! సచ్చిపోనాడు బాబూ!' అంటూ అడుక్కుని, సేతులు మార్చి, సేతులు మార్చి, వోసన తగలంగానే ఏ కాలవఁడో ఒగ్గేసి పారిపోతారు. నా మాటేటి తమకి నమ్మకం నేకపోతే విశారింసియ్యండి తల్లీ! పీనుగుల్ని మోసే వాళ్లమే గానీ... మాకాడ నిజాయితుందమ్మ గోరూ ! ఆలోచించుకోండి.

"సందేళైపోనాదని మాత్తం దిగులఁమాకండి. రేత్తిరైనా, పొగులైనా మా సార్జీ లొకటే...; సేసేపనీ ఒకటే !"

*　　*　　*

అంతసేపూ మౌన సముద్రంలో మునిగిపోయిన శారదలో కదలిక ఏర్పడింది.

ఆ కదలికతో ఇహలోకంలో పడేసరికి మళ్లీ నిస్సహాయిమైన ఆలోచనలు ఆమెను

**తెలిసీ - తెలియని**

మామూలు మనిషి ఏ కొండవాలులోనైనా డిసెంబరు పూవులు (వయొలెట్‌లు) పరిచినట్లు కనిపిస్తే కోసి, అందమైన గుత్తి తయారు చెయ్యాలనుకుంటాడు. అదే భూగర్భ శాస్త్రవేత్త అయితే అక్కడనేలలో జింక్ (తుత్తినాగం) వున్నదంటాడు.

సోవియెట్ విజ్ఞాన పరిషత్తు ప్రధమాధ్యక్షులు, భూగర్భ శాస్త్రవేత్త అయిన డా. అలెగ్జాండర్ కార్పిన్‌స్కీ సోదర శాస్త్రవేత్తలముందు ఒకచిత్రమైన ప్రశ్నవేశారు "భూగర్భ శిలా నిర్మాణ స్వరూపాన్ని, ఖనిజ నిక్షేపాన్ని మొక్కలు సూచిస్తాయా ?'

ఖనిజ నిధులను తెలుసుకోవడంలో మనుష్యునికి తోడ్పడగల అనేక వృక్షాలు యీ వేళ తెలుసును. జియోబోటని అనే శాస్త్రమే పరిణతి పొందింది.

జిప్సోఫిలా అనే మొక్క భూమిలోని రాగి గనులను చూపుతుందని ఇటీవలనే శాస్త్రవేత్తలు నిరూపించేరు. అల్టాయ్ మండలంలోని ప్రాచీన గనులలో ఆ మొక్క కనిపించింది. టిన్—కాపెర్ పొదలు నేలలో జిప్సమ్ వునికిని చూపుతాయి. పొట్టిచెర్రీ, ముళ్ల చిచ్‌పొదలుసున్నం రాయివున్నట్లు తెలుపుతాయి. హనీసకుల్ మొక్క బంగారం,వెండి వున్న చోట్ల పెరుగుతుంది.

వారస్‌వుడ్ వంటి చెట్లు కొన్ని చోట్ల చాలా ఎత్తుగా పెరుగుతాయి. కొన్నిచోట్ల గిడసబారివుంటాయి. నేలలో బరోన్‌ఎక్కువ తక్కువ వుండడం వలన యిది తటస్థిస్తుంది ఖనిజ నిధుల సమీపంలో కొన్ని మొక్కలలో కొన్ని మార్పులొస్తాయి. ఎడారుల్లోలకాంత ఫిల్లియమ్ అనే ముళ్ళ మొక్క పెంకురంగు పువ్వులు పూస్తుంది. కాని దాని పువ్వులు తెల్లగా వుంటే గంధకం హెచ్చుగా ఉంది, అక్కడి నేలలో అని అర్థం.

చాల మొక్కలు తామే ఖనిజాల్ని కూడబెడతాయి. వాటికాండాల్ని ఎండబెట్టి ఎంతో విలువైన పదార్థాలు వానినుంచి తీయవచ్చు. మొక్కలలో రాగో, జింక్, గంధకమో విశేషంగా కనిపిస్తే అవి వున్నచోట ఆలోహాలు దండిగా ఉన్నాయని అర్థం. ఏదో లోహంతో కూడిన ఆహారాన్ని జీర్ణం చేసుకోగల శక్తి మొక్కకుంది. అందుచేత ఆ మొక్క చచ్చిపోయినప్పుడు తాను కూడబెట్టిన పదార్థాన్ని తిరిగి నేలకే ఇచ్చేస్తుంది. జంతువులూఅంతే. ఆ విధంగా బొగ్గు, నూనె, రాగి, ఇంకాఅనేక ఉపయుక్తవస్తువులనిధులుఏర్పడుతున్నాయి.

వేధించ సాగాయి. చీకటి పడిపోతోంది. ప్రతి క్షణం ఒక శూలమై తన్ను పొడిచేస్తున్నంతగా కుమిలిపోసాగింది.

మనిషి బతకడానికైనా డబ్బే; పీనుగని సాగనంపడానికైనా డబ్బే! సరిగ్గా అదే లేదు తన దగ్గిర.. బ్యాగు తెరిచి చూసింది. రెండు రూపాయల లోపు చిల్లర.

చేతులు చూసుకుంది. బోసిగా ఉన్నాయి. అవి ఇప్పుడే కాదు; ఎప్పుడూ బోసే! కాకపోతే ఎడమ చేతికి ఉండాల్సిన వాచీమాత్రం మందులకోసం క్రితం రోజున మరో చెయ్యినలంకరించింది ఆర్టిస్టిక్‌గా మెళ్ళో మెదిలేది తళతళలాడే గొలుసు మాత్రమే; తెగ నమ్మినా పదిరూపాయలు రావు దానికి

కనీసం తోపుడిబండిమీద సాగనంపడానికి కూడా నోచుకోలేని తన సమర్థత. ఉన్న ఫ [illegible] తన గుండె ఆగిచ [illegible] తే? తనకా అదృష్టం కూడానా ? [illegible] ల్లబికి వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది శారద. కళ్ళు వర్షధారలైపోయాయి.

"సెప్పండమ్మా! మా కవతలేరే బేరాలుండాయి. ఒక్కతానే కూసోనాకి ఈలవదు మాకు."

కళ్ళలో నీళ్ళతోటే తలెత్తి చూసింది శారద. అప్పటికే కొంతమంది జనం ఆమె చుట్టూ మూగి ఉన్నారు. చోద్యం చూస్తున్నట్టు చూసే ఆ జనాన్ని చూసి కుంచించుకుపోయి మళ్ళీ తల దించేసుకుంది శారద.

"బాధ పడకమ్మా! మనం నిమిత్తమాత్రులం" అంటూ ఒణికిపోతున్న స్వరంతో ఆప్యాయంగా ఓదార్చ ప్రయత్నిం

## అదృష్టం జారిపోదు

చిన ఓ కంఠధ్వని విని మళ్ళీ తలెత్తి అటు వైపు చూసింది శారద.

ముడతలుబడ్డ శరీరం...తెల్లగా ముగ్గులా పండిపోయి జుట్టూ. చేతికర్ర ఊతా! ఇవాళో రేపో అన్నట్టు ఉన్న వయసు మళ్ళిపోయిన ఓ వృద్ధుడు సానుభూతిగా ఆమెవైపే చూస్తున్నాడు.

'ఏడవక, ఏం చెయ్యమంటారు బాబూ!' అన్నట్టు దీనంగా చూసింది శారద ఆ వృద్ధుడివైపు.

అమె కళ్ళలో ప్రస్ఫుటమౌతున్న ఉద్వేగాన్ని గ్రహించిన ఆ వృద్ధుడు, 'చదువుకున్న దానిలా కనపడుతున్నావు. నీకు అర్థం కానిదేముంది? అడుగడుగునా దుర్భరమయ్యే పరిస్థితులకి ఓర్పుతో, సహనంతో ఎదురు నిలిచి, జీవనాన్ని సాగించి అలిసిపోయే మనిషి ఈ రోజుల్లో చావులోనే సుఖపడుతున్నాడమ్మా! బాధపడకు. ఏదీ మన చేతుల్లో లేదు. మనిషి బ్రతికినంతకాలం ఎలా సుఖపడ్డాడనికాదు; ఎలా సుఖపెట్టేమన్నదీకాదు; ఎలా దాటిపోయాడన్నదే చూసుకోవాల్సిన మాయదారి రోజులివి. మనం బ్రతికినంత కాలమూ చెయ్యలేకపోయినా ... కనీసం మట్టిలో కల్సిపోయేటప్పుడైనా, జీవి ఆత్మ శాంతించేట్టు చెయ్యడం మన ధర్మమమ్మా! దహన సంస్కారం మన సంస్కారాల్లో గొప్పది తల్లీ! బాధపడి ప్రయోజనం లేదు. ఆలస్యం చెయ్యకు. నీ తండ్రిలాటివాడ్ని. నా చేతనైన సహాయం చేస్తున్నాను, కాదనకమ్మా!" అంటూ ఐదు రూపాయలనోటు ఆమె చేతిలో పెట్టి గిరుక్కుమని వెనుదిరిగాడు.

హటాత్తుగా జరిగిన ఈ సంఘటనకి నిస్త్రాణయై కొయ్యబారిపోయిన శారద, కొన్ని క్షణాల తరువాత తేరుకుని బావురుమనే లోపల, పాములాట ఎంతో ఆసక్తిగా చూసి, చివర్లో డబ్బులివ్వాల్సొస్తుందని తప్పించుకున్నట్టు కొంతమంది జారుకోగా, మిగిలిన వాళ్ళు, వాళ్లకి తోచింది విసిరేసి అయ్యోపాపం! అంటూ నిట్టూర్చి వెళ్లిపోయారు. శారద చుట్టూ చూసేసరికి... చిల్లర డబ్బులూ, రూపాయినోట్లూ వికటాట్టహాసం చేస్తూ కనిపించాయి తన ప్రమేయమే లేకుండా అలా పోగైన ఆ పాతిక ముప్పై రూపాయిల్ని చూసి, ఫేలవంగా నవ్వుకుంటూ అనుకుంది. బొమ్మలాడించేవాడు తోలు బొమ్మలకి ప్రాణం పోసి ఆడిస్తే... నేను ప్రాణముండే బొమ్మనే తోలుబొమ్మచేసి ఆడించావు. భగవాన్ ఎందుకు నాకీ శిక్ష...? కనికరించి నన్నీక్షణంలో అంతం చెయ్యలేవా ప్రభూ...?"

* * *

వర్షం లేదుగానీ, దేవుడు లోకాన్నంతా ముంచేసే ప్రయత్నమే చేసినట్టు ఉరుములూ, మెరుపులూ, ఉన్నట్టుండి మనుష్యుల్ని సహితం ఊడ్చి పారేసే ఈదురు గాలులూ! దేదీప్యమానంగా వెలిగే కరంటులైట్లు మెరుపులతో పోటీ...! చివరికి ఓటమి! ఎక్కడపోయిందో తెలీదు; ఊరు ఊరంతా చీకటి. కటిక చీకటి...!

జీవితం అంటే తియ్యటిదీ, మధురమైందీ

అని మభ్యపెట్టుకుంటున్న అమాయకులు హాస్పటల్లోకి రావడం, పోవడం తప్పించి, దాదాపు జన సంచారం స్థంభించి పోయింది ఆ రోడ్డుమీద, ఆరు గంటలు కాకుండానే!

వాహనాల లైట్ల కాంతిలో తళతళ మెరుస్తున్న ఉచిత ధర్మాసుపత్రిబోర్డు 'ఇచ్చట మనుషులు చంపబడుదురు' అన్న వ్యంగ్యాన్ని వికటాట్ట హాసం చేస్తోంది.

సన్నటి జల్లు ప్రారంభమైంది. ఈదురు గాలితో కూడిన ఆ జల్లు, ఇంజక్షను సిరంజి లోంచి పిచ్చికారీ చెయ్యబడ్డ ధారలా సూటిగా వచ్చి తగుల్తోంది ఒళ్లు జివ్వుమనేట్టు...!

"లే, శ్రీనివాస్! లే! వర్షం పడుతోంది" అని తట్టి లేపుతున్నట్టు అప్రయత్నంగా అతని రెండు చేతులూ పట్టుకుని కుదిపిన శారద, మెరుపు వెలుగులో శ్రీనివాస్ నిర్జీవ వదనాన్ని చూసి ఖిన్నురాలై అతని గుండెల మీద వాలిపోయింది.

* * *

"తల్చుకుంటేనే గుండె తరుక్కుపోయే పరిస్థితి తల్లీ! పుట్టిన ప్రతిజీవి గిట్టడానికే అన్నది సృష్టి ధర్మమే అని తెలిసినా, విలపిస్తాము. ఇది మనవల్ల జరిగిందేనేమో అనుకుంటూ భ్రమపడతాము. తప్పమ్మా, ఏడవకు! శ్రీవా౦ అదృష్టవంతుడే అనుకోవాలి. బాధపడకుండా, దాటిపోయాడు!"

శారద మాట్లాడలేదు. నిర్లిప్తంగా ఉండిపోయింది.

"గగుర్పాటు కలిగించే ఈ పరిస్థితుల్లో నిన్ను ఓదార్చడం అలాఉంచి, ఆశ్రయించక తప్పడంలేదమ్మా! నాకో సహాయం చెయ్యగలవా? జన్మజన్మలకి ఋణపడి ఉంటాను!"

మౌనంగా నిర్లిప్తంగా ఉండిపోయిన శారద ఆశ్చర్యంగా చూసింది అతన్ని.

నిర్మలమైన వదనమే అయినా ... కళ్ళలో ఏదో చెప్పుకోలేని బాధ ప్రస్ఫుటమౌతున్నట్లు గమనించింది శారద. రామచంద్రమూర్తి ఎవరో అరగంట క్రితందాకా తనకి తెలియదు.

నిస్సహాయ పరిస్థితులలో ఏదీ తోచక, పరిగెత్తి పారిపోయి ఏ రైలుక్రిందైనా పడిపోదామా అని అనుకుంటున్న సమయంలో "బాధ పడకమ్మా! నేను చేస్తాను దహన సంస్కారాలు" అంటూ ముందుకి వచ్చాడు. ఆమె ఆ క్షణంలో శ్రీరామచంద్రుడ్నే చూసింది అతని ముఖ వర్చస్సులో. మానవతా వాదాన్ని త్రోసిపుచ్చక, సాటిమనిషిని అర్థంచేసుకుని మహోపకారం చెయ్యడానికి సంసిద్ధుడైన ఈ మహాత్ముడు నా నుంచి ఆశించే సహాయమేమై ఉంటుంది ... ??? ఆశ్చర్యంగా చూసింది శారద!

పెల్లుబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు రామచంద్రమూర్తి. సాధ్యపడటంలేదు; నోట మాటరాని అతని పరిస్థితి గమనించి శారదే అంది: "నేను చేయగల సహాయమేమిటో? సంశయించకండి, ఏదైనా చేస్తాను ... చెప్పండి మేష్టారూ!"

ఆమె అడిగిన ప్రశ్నకి వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు రామచంద్రమూర్తి రెండు నిముషాలాగి అన్నాడు;

'ఏం చెప్పమంటావు తల్లీ! ఒక్కగానొక్క బంగారుబొమ్మ నా చెల్లెలు రాధ. పెళ్ళై పూర్తిగా సంవత్సరంకూడా కాలేదు. దేవుడింతలోనే చిన్నచూపు చూశాడు. యాక్సిడెంటైన బావగారు దాటిపోయినా ఇంత బాధ దేవుడ్ని కాదేమో...! 'ఆయుష్షు తీరిపోయింది-దాటిపోయాడు' అని ఒక్కసారి ఏడ్చి సరిపెట్టుకో గలిగేవాడ్ని!

కానీ జీవితాంతమూ ఇలా కుమిలి పోవాల్సిన పరిస్థితులేర్పడ్డాయమ్మా! నైవేద్యంలా రెండు కళ్ళూ తీసేసుకున్నాడు దేవుడు."


ఆ మాట చెబుతున్నపుడు అతని గొంతుకలో బాధ మరింత ఎక్కువైపోయిందేమో కొన్ని క్షణాలదాకా మళ్ళీ మాట్లాడలేక పోయాడు.

"మాకు ఆస్తి ఉంది. హోదా ఉంది. అన్ని సుఖాలు ఉన్నాయి; ఒక్క మనశ్శాంతి తప్ప. ఇదమ్మా నా పరిస్థితి. ఈ పరిస్థితుల్లోనే నేను నిన్ను మరింత మనఃక్లేశానికి గురిచేసి ... నీ నుండి సహాయం పొందాలని చూస్తున్నాను. నేనేమిస్తే మాత్రం దానికి ఋణం తీర్చుకున్నట్లౌతుంది ...? అయినా అడగలేక అడగలేక అడుగుతున్నాను. చచ్చి నీ కడుపున పుట్టి, జీవితాంతం సేవచేసి నీ ఋణం తీర్చుకుంటాను. చెప్పమ్మా! నీ భర్త కంటి పాపలతో నా బావకి దృష్టి ప్రసాదించగలవా తల్లీ?" రామచంద్రమూర్తి రెండు చేతులూ దోసిడిగా చేసి అర్థిస్తున్నాడు.

ఆ...! ఆ! ఎంత స్వార్థం? ఎంత కుట్ర? అని శారద గొంతుక చించుకుని అరవలేదు. అవుననలేదు; కాదనలేదు! అసలు చలనమే లేకుండా ఉండిపోయింది శ్రీనివాస్ భౌతిక కాయాన్ని చూస్తూ!

రెండు నిమిషాలు పైగా, మాటా పలుకూ లేకుండా అలా ఉండిపోయిన శారదని అనునయంగా 'చెయ్యలేవమ్మా! నాకు తెలుసు. ఇది త్యాగం కాదు ఘోరమైన పాపం...! అయినా ఉండబట్టలేక అడిగేశాను. డాక్టరుగారు మరీ మరీ ప్రోత్సహించడంతో నిన్నిలా బాధ పెట్టాల్సొచ్చింది. నన్ను క్షమించమ్మా!" అన్నాడు రామచంద్రమూర్తి గాద్గదికంగా!

శారద దేనికీ సమాధానం ఇవ్వలేదు. అదే మౌనంలో ఉండిపోయింది. సుళ్లు తిరిగి



పోతున్న ఆమె కళ్ళల్లో నీళ్ళలోంచి మసకగా కనపడుతున్న శ్రీనివాస్ భౌతిక కాయాన్ని చూస్తూ, గునపాలు గుచ్చుకున్నట్లై భోల్లుమంది.

మా పెళ్ళికి ఎవరూ ఒప్పుకోలేదు. కులాలు వేరని అడ్డుపడి పోయారు పెద్దవాళ్ళు. అయినా ఒకళ్ళకొకళ్ళం కావాలనుకున్నాం! అయ్యాం! అయి ఏం సాధించగలిగాం...? భగవాన్ ఏం తప్పు చేశామని మాకీ శిక్ష...?

నిరుపేదననీ, అనాధననీ జాలిపడి చేరదీసి, నా జీవితానికో అర్థాన్ని సృష్టించిన ఉత్తముడు శ్రీనివాస్! ఆయన్నే తీసుకెళ్ళిపోయావు. మేం చేసిన అపరాధం ఏమిటి భగవాన్ ?

మా కాళ్ళమీద మేము నిలబడ గలమన్న నాడు పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. అలా మేము కోరుకున్నట్టే శ్రీనివాస్‌కి ఉద్యోగం వచ్చింది. మంచి రోజులు వచ్చాయి. మా ఆశలు ఫలించాయని నీ సన్నిధిలో ఒకళ్ళకొకళ్ళమై ఇలా 'హనీమూన్' కని ఊరు విడిచి వందల మైళ్ళు దూరం వచ్చి ప్రకృతినీ దాని రమణీయతనీ ఆస్వాదించే... ఈ పరిస్థితుల్లోనా తండ్రీ ఆ చిన్న మార్పు చూసేది...?

ఆ మాయదారి గాస్ట్రో ఎంట్రైటిస్ నాకు వచ్చినా, ఎంతో అదృష్టవంతురాలినై ఆయన చేతులమీదే దాటిపోయేదాన్ని. అలాగాక ఆయన్నే తీసికెళ్ళిపోయావు.

కేవలం ఒక్కరోజులో దాపురించిన ఈ వ్యాధిని తగ్గించినట్లు తగ్గించి, మరింత ఉధృతంచేసి మోసంచేసి తీసికెళ్ళిపోయావు. ఇది నీకు తగునా భగవాన్!'' నిస్సహాయురాలైన శారద చూడలేక చూడలేక మళ్ళీ శ్రీనివాస్ వదనాన్ని తిలకిస్తూ అనుకుంది.

'జీవితాంతం ఒకరికొకరు తోడనుకున్నాం. నాకా అదృష్టం లేకపోయింది. ఈ హఠాత్సంఘటన జరక్కపోతే నిన్నెంత సుఖపెట్టేదాన్నో నాకు తెలీదుగాని, పోయిన తరువాత కనీసం అంత్యక్రియలు కూడా జరిపించే స్థోమత లేనిదాన్నైపోయాను. చివరికి నీ శవాన్ని మట్టిలో కలపడానికి కూడా నువ్వే పూనుకోవాల్సొచ్చిందంటే నన్ను క్షమిస్తావో లేదో శ్రీనివాస్...!

దివ్యజ్యోతుల్లాంటి నీ కంటిపాపలు మరో


విటమిన్లు మరియు ఖనిజములు
మీ కుటుంబము యొక్క ఆరోగ్యమునకు ఎంతో అవసరము



వారికి తగినన్ని లభిస్తున్నాయా?

అవి లభించకపోతే, వారికి ప్రతి రోజూ విమ్‌గ్రాన్ బిళ్ళ యివ్వండి. రోజంతా మీ కుటుంబంలోని వారందరినీ ఉత్సాహంగా, శక్తివంతంగా ఉంచేందుకు విటమిన్లు, ఖనిజ పదార్థాలుగల విమ్‌గ్రాన్ వాడండి.

విమ్‌గ్రాన్®

వివిధ విటమిన్లు మరియు ఖనిజములుగల బిళ్లలు
11 విటమిన్లు + 8 ఖనిజ పదార్థములు




SQUIBB®
SARABHAI CHEMICALS LTD.

® ఇ. ఆర్. స్క్విబ్ & సన్స్ ఇన్‌కార్పొరేటెడ్ వారి రెజిస్టర్డ్ ట్రేడ్ మార్క్కు చిహ్నం దీని లైసెన్సుడు ఉపయోగదారులు ఎస్‌సిఎల్.

ఒక విమ్‌గ్రాన్ మిమ్మల్ని రోజంతా శక్తివంతముగా ఉంచుతుంది

Shilpi-SC-2A/75 tel

40 సం॥ అనుభవం
వరిబీజము బుడ్డలు బీజకుటు మొదలగు వ్యాధులకు ఆపరేషన్ లేకుండా గ్యారంటిగా బాగుచేయబడును
వివరములకు:
రే అండ్ కో రిజిష్టర్డు ఆసుపత్రి
గౌలిగూడ నయ బస్ డిపో ఎదుట, బాలాజీలాడ్జింగ్ ప్రక్కన, హైద్రాబాద్-12.
ఆఫీస్‌ఫోన్: 42870, ఇంటిఫోన్: 38544

SEL-TEX
SEL-TEX
• ఎగ్జిమా
• పక్షపు ఉరదలు
• పొక్కులు
• చలిపగుళ్ళు
• మొటిమలు
తామరగజ్జి ఆయింట్‌మెంట్
PHARMA-MEDICO (INDIA) PVT. LTD.
BOMBAY-60-NB
ఏజెంట్లు: (1) సిటి ఫార్మా డిస్ట్రిబ్యూటర్సు, బావనారాయణవీధి, విజయవాడ—1, (ఆం.ప్ర.)
(2) ఫార్మా ట్రేడర్సు (హైదరాబాద్), కందస్వామిరోడ్, సుల్తాన్‌బజార్, హైదరాబాదు ఆం.ప్ర.

70 సం॥గా దేశఖ్యాతిగాంచిన
నారసింహలేహ్యము
పాలామిస్త్రీ, వపేధామిస్త్రీ, గజీతము, కంకుమపువ్వు, మొ. అనేక వస్తు సముదాయము అన్ని విధములైన బలహీనతలను పోగొట్టి పుష్టి, పటుత్వము, నిక్కిలి బలము కలిగించుటలో అత్యుత్తమమైనది.
1 డబ్బా ఖరీదు రు. 6.75 పోస్టేజి అదనము.
పి. శి. ఏ. అండ్ కో.,
పెరిదేపి, ప్రకాశం జిల్లా.
పెద్ద క్యాటలాగు, వైద్య సలహా ఉచితము.
ఏజన్సీలు యివ్వబడును.

# అదృష్టం జారిపోదు

జంటకి వెలుగు రేఖలుగా మార్చి మరీ వెళ్తున్నావు. నువ్వు ధన్యుడివి శ్రీనివాస్!

నేను అసహాయురాల్ని. నీ శరీరం కిరాతకులకి అప్పజెప్పి వెళ్ళలేను. దిక్కులేకుండా వదిలేసి పారిపోలేను. పంచభూతాల్లో కల్పిపోడానికి లోటురాని స్మశాన వైరాగ్యాన్ని మాత్రం ఏర్పరచగలిగాననే తృప్తైనా ఈ మాయదారి జీవితానికి మిగలాలనే ఈ పని చేస్తున్నాను శ్రీనివాస్, నన్ను క్షమిస్తావు కదూ!"

"పోనీలేమ్మా; బాధపడకు!" ఆమె కళ్ళలో ధారలుగా రాలిపోతున్న ముత్యాల్ని చూసి రామచంద్రమూర్తి నివారించబోయాడు.

"బాధపడటం లేదు మూర్తిగారూ, గర్విస్తున్నాను. శ్రీనివాస్ ఎంతో ఉత్తముడు. కాబట్టే, తనువు చాలించికూడా ఉపయోగపడుతున్నాడు" దుఃఖం ముంచుకురాగా శారద అంతకన్నా మరి మాట్లాడలేక పోయింది.

"నువ్వు మనిషివి మాత్రం కాదమ్మా! మానవేతరానివి. దేవతవి వయస్సులో చిన్నదానివైనా చేతులెత్తి మొక్కుతున్నాను. దేవుడు నిన్ను చల్లగా కాపాడ్తాడమ్మా!" రామచంద్రమూర్తి పరమానంద భరితుడై రెండు చేతులూ జోడించాడు కృతజ్ఞతగా!

"దేవుడు చెయ్యాల్సిన సహాయంచేసేశాడు. ఇప్పుడు నాకు కావలసింది మానవ సహాయం! మీ చెల్లెలు లాటిదాన్ని మూర్తిగారూ! మీ చేతులమీద శ్రీనివాస్‌ని మట్టిలో కలిపేస్తే అంతకన్నా నాకు కావలసిందేంలేదు. ఏనాటికైనా నేనే మీకు ఋణపడి ఉంటాను." శారద రెండు చేతులూ జోడించింది శ్రేయపూర్వకంగా!

"ఋణం సంగతి మాట్లాడకు తల్లీ! ఆ మాట వర్తించేది నాకూ, నా చెల్లెలికీ! రాధ జీవితంలో కొత్త వెలుగుని చూపించావు. నువ్వు మా ఇలవేల్పువి. నువ్వు చేసిన ఈ మహత్తర త్యాగం ముందు నేను చేసే సహాయం ఎంతమ్మా? నిజానికిది సహాయం కాదు — బాధ్యత!

నా చేతుల్తో నేనే శ్రీనివాస్‌ని పంచభూతాల్లో మిళితంచేస్తాను నువ్వు బెంగపడకమ్మా! వెళ్దాం పదమ్మా! ఇప్పటికే ప్రొద్దుపోతోంది అర్జంటుగా మనం 'ఐ హాస్పిటల్'కి వెళ్ళాలి"

* * *

'వెళ్ళొస్తాను మూర్తిగారూ, నాకు సెలవిప్పించండి!' అంటూ మరోసారి చేతులు జోడించింది శారద ఐ హస్పిటల్లో పారాలమీద సంతకాలు పెట్టేసి బైటికి రాగానే!

"మీ చెల్లెలులాటిదాన్ని మూర్తిగారూ! అన్నావు నేనెంత సంబరపడిపోయానో తెలీదు. తోడబుట్టిన వాళ్ళం కాకపోయినా, అంతకన్నా మిన్న ఐన అనుబూతే మనది. నీకుమాత్రం ఎవరు...? మాతో ఉండిపోవమ్మా! నీకేలోటూ లేకుండా చూస్తాను." రామచంద్రమూర్తి కృతజ్ఞతాపూర్వకంగా అర్థించాడు.

"లేదు మూర్తిగారూ! వెళ్ళిపోవాలి. మీ ఆదరణకి కృతజ్ఞురాల్ని. ప్లీజ్, నేనిక్కడ ఉండలేను దయచేసి అడ్డు చెప్పకండి!"

"పోనీలేమ్మా. మాతో ఉండిపోవడానికి నీకు మనస్కరించకపోతే, బలవంతంచెయ్యను గానీ, కొన్నాళ్ళైనా విశ్రాంతిగా మాతో గడిపి వెళ్ళిపోదువుగాని. నామాట మన్నించవూ?"

"మీకెలా చెప్పాలో అర్థంకావటంలేదు మూర్తిగారూ! మనశ్శాంతీ, విశ్రాంతీ అన్నవి చాలా అరుదైనవి నా జీవితంలో. నిజానికి నేనింకా ఇక్కడే ఉంటే...అవి పూర్తిగా నోచుకునే పరిస్థితులే ఏర్పడతాయిగానీ... మనోధైర్యం అన్నదానికి ఆస్కారం అంటూ ఎక్కడ ఉంటుందో చెప్పండి...? నా శ్రేయస్సు కోరేవారు మీరు. నా పరిస్థితి అర్థంచేసుకుని సెలవిప్పించండి...! వేడుకుంటున్నాను."

"మనశ్శాంతికోసం నువ్వు వెళ్ళిపోవాలనుకుంటే అడ్డు తగిలేనేమోనమ్మా. కానీ, మంచికి మానవత్వానికి ప్రతిరూపమైన నిన్ను కనీసం దర్శించుకునే భాగ్యం, నా చెల్లెలికి కూడా కలిగించవూ?"

'మీకు తెలీదు మూర్తిగారూ! ఎన్ని ఒడుదుడుకులున్నా మనశాస్త్ర ధర్మాలూ, మూఢనమ్మకాలూ ఇంకా మన్ని వెంటాడుతూనే ఉన్నాయి భర్తపోయిన నన్ను ఏ పునిస్త్రీ ఆడదీ ఈ శ్రావణ మాసపు రోజుల్లో చూడాలను దు నేనొచ్చి ఆమెనే మాత్రం కోరడంపగలరు చెప్పండి; లేనిపోని మనస్పర్థలు కలిగించడం తప్పు...?"

ఆ మాటకి రామచంద్రమూర్తి కళ్లలో నీళ్ళు తిరిగాయి. అయినా నిలదొక్కుకుని ఉన్నాడు. "అంతమాట అనకు తల్లీ! సాటి మనిషిని అర్థంచేసుకునే సంస్కారవతివి. నువ్వెన్నటికీ అమంగళివి కాదమ్మా!

స్వయంగా నీకు చేతులెత్తి జోహార్లర్పించండే నా చెల్లెలు మాత్రం తృప్తి పడగలదా? అందుకే అర్థిస్తున్నాను. దయచేసి ఒక్కసారి, ఆమెకా భాగ్యం కలిగించి వెళ్లిపోదువుగాని నా మాట మన్నించమ్మా!''

రామచంద్రమూర్తి అంత ప్రాధేయపడే సరికి శారదకి సరే అనక తప్పలేదు.

రామచంద్రమూర్తి శారదని ఇంటికి తీసుకువెళ్లి, చెల్లెలు రాధకి అప్పజెప్పి, శ్రీనివాస్ భౌతిక కాయానికి దహన సంస్కారాల ఏర్పాట్లకి మళ్లీ హాస్పిటల్‌కి వెళ్లిపోయాడు వెంటనే!

* * *

''కథల్లో కూడా సాధ్యపడని త్యాగాన్ని చేశారు. సొంతవాళ్లు కూడా ఇంత సాహసించలేరు. మీ దంపతులిద్దరూ కారణజన్ములు శారదగారూ! మీకు ఎప్పుడూ ఋణపడే ఉంటాము'' కన్నీళ్లతోనే శారద కాళ్లు కడిగింది రాధ.

''తప్పమ్మా! ఏడవకూడదు. మన ఇష్టపడి చేసుకోవాలనుకుని ఒకరికొకరు ముడిపడ్డ దంపతుల ఆనందం ఎలాంటిదో నాకు బాగా తెలుసు. అలాంటి జంట నూరేళ్లూ హాయిగా, ఆనందంగా సాగిపోవాలనే కోరుకుంటూ ఉంటాను. మరి వెళ్లొస్తాను రాధా!''

''వెళ్లిపోతావా అక్కయ్యా?'' దాదాపు చిన్న పిల్లలా అరిచింది రాధ.

శారద సూటిగా రాధ కళ్లలోకి చూసింది.

''అవునక్కయ్యా! అనూహ్యమైన ఈ బాధాపూరిత తన్మయానందాలలో నిన్నలాగే పిలవాలనిపిస్తోంది. అన్నయ్య అంతా చెప్పాడు కాబట్టి, పరిస్థితిని అర్థంచేసుకుని నువ్వు వెళ్లిపోతానంటే అడ్డుచెప్పి బాధపెట్టలేను గానీ, కనీసం మోహన్‌కి కట్లువిప్పేనాకా అయినా ఉండగలిగితే మాకెంతో నిండుగా ఉంటుందక్కయ్యా! ప్లీజ్!''

''క్షమించు రాధా! వెళ్లిపోవాలి. నేనేదో త్యాగం చేశానంటూ మీరంతా కృతజ్ఞతలు చెబుతూ నెత్తిమీద పెట్టుకోవడం సరి పెట్టుకోలేను. ఇక్కడఉంటే అనుక్షణం ఈ విషయాలే తలపుల్లోకి వచ్చి మిమ్మల్నీ నన్నూ కూడా మరింత కృంగదీస్తాయి. అందుకే వీలైనంత తొందరగా వెళ్లిపోవాలనుకుంటున్నాను.సాయంత్రం బండికే వెళ్తాను.''

రాధ మరి మాట్లాడలేకపోయింది. శారద ఆ విషయం మర్చిపోయేట్టు ఏవేవో సంగతులు చెప్పి మధ్యాహ్నం దాకా గడిపింది.

* * *

ఎర్రబడిన కళ్ళతో, రేగిపోయిన జుట్టుతో నీరసంగా అడుగులువేస్తూ వస్తున్నాడు రామచంద్రమూర్తి. రాధ గబాలున లేచి ఎదురు వెళ్ళింది. శారదమాత్రం గంభీరంగా అలా సోఫాలోనే కూర్చుండిపోయింది.

''కాసిని మంచినీళ్ళు!'' నీరసంగా అడిగాడు రామచంద్రమూర్తి. రాధ గబగబా లోపలికి వెళ్ళి మంచినీళ్ళు పట్టుకువచ్చింది.

మంచినీళ్ళు త్రాగి, నుదుటిమీద చెమటని రుమాలుతో తుడుచుకుంటూ గాద్గదికంగా అన్నాడు శారద నుద్దేశించి, 'ముత్యాల్లాంటి కంటిపాపలు తీసుకుని ఈ పాపిష్టి చేతులతోనే శ్రీనివాస్‌ని బుగ్గిపాలు చేసేసి వచ్చానమ్మా! భౌతికంగా శ్రీనివాస్ నీకు దూరమైపోయాడు...! ఇదమ్మా, నేను నీకు చేసిన సాయం...!'' రామచంద్రమూర్తి కనుకొలకుల్లోంచి నీళ్ళు సుళ్ళు తిరిగాయి. కళ్ళు మూసుకుని చేతుల్తో కణతలు నొక్కుకుంటూ సోఫాలో చేరబడ్డాడు.

నిశ్చలంగా, నిర్లిప్తంగా కూర్చున్న శారద పెదవి విప్పి మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టు కిటికీవంక చూస్తూ ఉండిపోయింది, ఓ రెండు నిమిషాలు...!

''మీ సహాయం మరువలేను. ఋణం సంగతి ఎత్తితే ఈ జన్మకేకాదు; ఎన్ని జన్మలెత్తినా తీరేదికాదు! నాకు సెలవిప్పించండి మూర్తిగారూ, నాలుగ్గంటల బండిలో వెళ్ళిపోతాను.''

''ఇప్పుడా, ఈపరిస్థితుల్లోనా? వద్దమ్మా! అదిగాక మోహన్‌కి ఆపరేషన్ చేసి ఈ రాత్రి కళ్ళు అమరుస్తారని డాక్టరుగారు చెప్పారు. కాబట్టి అది అయిపోయి, కట్లువిప్పేదాకా అయినా ఉండి వెళ్ళిపోదువుగానీ. మాకెంతో తృప్తిగా ఉంటుంది. నా మాట కాదనకమ్మా!'' రామచంద్రమూర్తి వారించబోయాడు.

''నో...నో ఇంపాసిబుల్. పంపించేస్తానని మాటిచ్చారు. దయచేసి మళ్ళీ కాదనకండి...! నేను వెళ్ళిపోవాలి! ఇక్కడింక మరోక్షణం కూడా ఉండలేను'' శారద గట్టిగా అరిచింది.

క్షణక్షణానికీ శారద అంతర్యంలోని బాధ మరింత ఉధృతమైపోతోందని గ్రహించిన రామచంద్రమూర్తి ఇక ఎదురు చెప్పలేకపోయాడు.

''సరేనమ్మా ఇవాళ సాయంత్రం బండికే వెళ్ళిపోదువుగానీ'' అంటూ సోఫాలోంచి లేచి బాత్‌రూమ్‌వైపు నడిచాడు, స్నానానికి బయల్దేరడానికి.

* * *

''నీ ఔదార్యాన్ని లెక్క కడుతున్నానని మాత్రం అనుకోవద్దు, ఉంచమ్మా నీ ఖర్చులకిది'' అంటూ పర్సు చేతి కందించాడు రామచంద్రమూర్తి టికెట్‌తోపాటు.

మరోసారి నిర్లిప్తంగా నవ్విన శారద అందులో రెండు పదిరూపాయల నోట్లు తీసుకుని, 'చాలు వెళ్లిరండి! మళ్లీ ఆపరేషన్‌కి పైమైపోతోంది' అంది.

''ఫరవాలేదు'' రైలు రాగానే ఎక్కించి వెళ్తాము' అన్నారిద్దరూ.

''రైలు రావడానికింకా ఆలస్యం ఉంది. దయచేసి వెళ్లిరండి'' అన్నది శారద.



గుండెనిండా నిండిపోయిన బాధతో కృంగిపోతున్న ఆమె ఏకాంతాన్ని ఆశిస్తోందని గ్రహించిన రామచంద్రమూర్తి 'అలాగేనమ్మా!' అనే లోపల 'వెళ్ళొస్తానక్కయ్యా!' బొంగురుపోయిన కంఠంతో చేతులు జోడించిందిరాధ.

"చనువు తీసుకుంటున్నాననని అనుకోకు శారదా! రాధలాటి దానివి. జరిగింది మర్చిపోయి హాయిగా పెళ్ళి చేసుకుని వర్ధిల్లాలని నా ఆశ. నీ ఔదార్యం, నీ మంచితనం, ఎప్పుడూ నిన్ను కాపాడుతూనే ఉంటాయి. అయినా, జీవితంలో ఏ అవసరమొచ్చినా ... ఈ అన్నయ్యని మాత్రం మర్చిపోకు — గుడ్ లక్ !" దుఃఖం పొంగిరాగా తడబడుతూ గాద్గదంగా అని రామచంద్రమూర్తి కళ్ళజోడు తీసి, చెమర్చిన కళ్లను తుడ్చుకుని, 'వెళ్లొస్తానమ్మా!' అని చేతులు జోడించాడు.

హృదయపూర్వకంగా నమస్కరించింది శారద.

రాధా, రామచంద్రమూర్తి వెనుదిరిగి వెళ్ళిపోయారు. వెళ్లిపోతున్న వాళ్లనూ తదేకంగా చూస్తూ ఉండిపోయింది శారద.

మరో పదినిమిషాల్లో ఎనౌన్స్‌మెంట్; ఎక్స్‌ప్రెస్ నాలుగ్గంటలు లేటని... !


* * *

గంట గడిచేసరికి బ్రహ్మ ప్రళయమైపోయింది శారదకి. ఏకాంతం కోసం రామచంద్రమూర్తినీ రాధనీ పంపించేస్తే ... ఒంటరిగా మిగిలిన తన్ని ఆలోచనలు మతిస్థిమితం లేకుండా చేస్తున్నాయి. ఆ ఆవేదన భరించలేని శారద కాస్త చల్లగాలి కోసం స్టేషన్ బైటికి వచ్చి ... ఎదురుగా ఉన్న పార్కు వైపు దారి తీసింది.

పార్కు సెంటర్లో జనం గుమిగూడి ఉన్నారు.

"ఒక్కగానొక్క కొడుకుబాబూ! ఈ ముసలాణ్ణిలా గర్భశోకంలో ముంచేసి వెళ్ళిపోయాడు. కళ్ళ ఆపరేషనుకని వస్తే...ఇలా కలరావచ్చి దాటిపోయాడు ముసలి ముండా కొడుకుని. నా తలకొరివి పెట్టేవాణ్ని, నేనే బూడిద చెయ్యాల్సొచ్చింది. ఎవరని ఏగానీ లేదు చేతిలో. ఎలాసాగనంపేది నా బాబుని...?

కరుణగల తల్లులు. దయగల తండ్రులు, మీ తోడబుట్టిన వాడనుకుని మీరే తలో చెయ్యీ వెయ్యాలి..." తలమీద రెండు చేతులూ పెట్టుకుని పిచ్చిగా అరుస్తూ రోదిస్తున్నాడో వృద్ధుడు.




# అదృష్టం జారిపోదు

గుమిగూడిన జనం ప్రక్కనుంచే పార్కులోకి దారితీస్తున్న శారద వృద్ధుడి ఆర్తనాదం విని అచేతనంగా ఆగిపోయి, కర్తవ్యం బోధించినట్టు, జనాన్ని తప్పించుకుని, పర్సులోంచి పదిరూపాయలనోటు తీసి వృద్ధుడి చేతిలో పెడుతూ, అతడ్ని చూసి దిగ్భ్రాంతి చెంది, నోటమాట రాక, రెండడుగులు వెనక్కివేసి.... అప్రయత్నంగా శవాన్ని చూసి నఖశిఖపర్యంతమూ కలిగిన గగుర్పాటుకి కళ్ళు బైర్లుకమ్మగా, అసంకల్పితంగా మరో రెండడుగులు వెనక్కివేసి... ఆ! శ్రీనివాస్...! ఆ! శ్రీనివాస్! అంటూ కుప్పలా కూలిపోయింది.

'భగవాన్ నన్ను అంతం చెయ్యలేవా? ఈ క్షణంలో గుండె నాపలేవా?' అంటూ క్రితంరోజు ఆమె చేసిన ఆక్రందనలు ఇప్పుడు విన్నాడేమో...భక్తి పరిపక్వమైన భక్తురాలికి మోక్షసిద్ధి చేసినట్టు, భగవంతుడామెను స్వీకరించాడు.

'ఎవరో పాపం అడకూతురు. నడుస్తూ నడుస్తూ గుండెఆగి పడిపోయింది. పాపం పడిపోతూ కూడా ఆ భగవంతుడ్నే స్మరిస్తూ పోయింది. అదృష్టవంతురాలు ...!'

జనం ఆమె చావుని సమీక్షించి సానుభూతి వ్యక్తం చేశారు

* * *

నిజమే ..!

శారద అదృష్టవంతురాలు...! ఎంతో అదృష్టవంతురాలు!

కేవలం తనపట్ల సానుభూతి వ్యక్తం చేసి క్రితం రోజు ఐదురూపాయలు చేతిలో పెట్టిన ముసలాడే ... ఇవాళ శ్రీనివాస్ తండ్రి అవతారం ఎత్తి సాక్షాత్కరించిన మరుక్షణంలో దాటిపోయింది.

నిజానికి మోహన్ అనేవాడు లేనేలేడనీ, చచ్చిపోయిన మనుషుల్ని సహితం మోసం చేసి బ్రతికే కూటానికి రామచంద్రమూర్తి నాయకుడనీ, రాధ అతని చెల్లెలుకాదు; కేవలం ఉంపుడుకత్తె అనీ, శ్రీనివాస్ కంటిపాపలు ఖరీదైన శేర్‌కి ఐదువేలకి అమ్ముడుపోగా ... శరీరాన్ని ముసలాడు వందరూపాయలకి కొనుక్కున్నాడనీ... శారద తెల్సుకోకుండానే దాటిపోవడంలో కొంత అదృష్టవంతురాలను కోవాలి !

అలా గాక.

తెల్సుకునుంటే 'నాసమ్మతిన నా భర్త కళ్ల దానం చేస్తున్నాను' అని హాస్పటల్లో కాగితంమీద రాసిచ్చినందుకు నోరెత్తే అవకాశంలేక, జుట్టు పీక్కునీ పీక్కుని, చావలేకా బ్రతకలేకా, మతి చెలించి పిచ్చెక్కిపోయేది — ఇలా జరగలేదు కాబట్టి మరి కొంత అదృష్టవంతురాలనుకోవాలి !

అన్నిటికన్నా మిన్నగా రామచంద్రమూర్తి కల్పిస్తున్న ఆశయాన్ని తిరస్కరించడంలో పొరపాటున కూడా సూర్యరశ్మి సోకని పాతాళ గృహంలో, భయంకరమైన బలవంతపు వేశ్యా యోగం తప్పినందుకు మరింత అదృష్టవంతురాలూ, ఎంతో అదృష్టవంతురాలూ అనుకోవాలి...!

* * *

ఇరవై నాలుగ్గంటలు నిరీక్షించి దిక్కులేని జీవికింద జమకట్టి ఆమె శవాన్ని మునిసిపాలిటీవాళ్ళూ. నిర్జీవులైన శ్రీనివాస్‌ని స్థలాలు మార్చి, మార్చి అడుక్కుని ముష్టివాళ్ళూ, అన్నదమ్ముల్లాగా, ఐకమత్యంతో దాదాపు ఒకే సమయంలో తమ కర్తవ్యం నిర్వహించుకున్నారు స్మశానంలో !

'ఎప్పటికీ కలిసే ఉంటాము' అని ప్రమాణం చేసుకుంటున్నప్పుడు గుళ్లో బండరాయి వినలేదనీ, చూడలేదనీ కాబోలు; మరోసారి దేవుడితో 'కష్టాల్లో, సుఖాల్లో మాత్రమే కాదు; చావులో కూడా కలిసే ఉంటాము' అని చెప్పడానికి అమరలోకానికి వెళ్తున్నట్టుగా ప్రక్క ప్రక్కన మండేచితిలో మంటలు ఒకటిగా కలిసిపోయాయి !